నవరత్నాలతో ప్రజల జీవితాల్లో కొత్త కాంతులు

- జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్
- చించినాడలో గడప గడపకు మన ప్రభుత్వం



యలమంచిలి మండలం చించినాడలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలి: చించినాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వరుసగా రెండో రోజు మంగళవారం పండుగ వాతావరణంలో కొనసాగింది. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏ ఇంటికి వెళ్లినా నవరత్నాల్లో కనీసం రెండు మూడు పథకాలు మాకు లభించాయని ప్రజలు ఆనందంతో చెప్పారు. ప్రతి నెల మొదటి రోజు తెల్లవారుజామునే వలంటీర్లు వచ్చి పింఛన్ అందివ్వడంపై లబ్ధిదారులంతా ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సాధారణంగా అధికారంలో ఉన్న నాయకులు గ్రామాల్లో పర్యటిస్తే నిలదీతలు, నిరసనలు ఎదురవుతాయన్నారు. కానీ సీఎం జగనన్న పార్టీలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేయడంతో ప్రజలంతా హాయిగా ఉన్నారని చెప్పారు. పథకాలతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. జగనన్నకు ప్రజల అండదండలున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దంగేటి రాజమణి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి, ఉప సర్పంచ్ రుద్రరాజు బలరామకృష్ణంరాజు (చిన్న) పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదునూరి లక్ష్మీపతిరాజు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, నాయకులు విప్పర్తి నవీన్, ముదునూరి రంగరాజు, కఠారి నారాయణస్వామి, బందారు అరుణాదేవి, రేపూరి శ్రీనివాస్, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, దొంగ విజయ్‌కుమార్, ఇలపకుర్తి నరసింహారావు, జవదాల సువర్ణరాజు, కల్యాణం గంగాధరరావు, బొక్కా సురేష్, డేగల సూర్యప్రభ పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సులు

పెనుగొండ: పెనుగొండ మండలంలోని గృహసారథులకు బుధవారం ఉదయం 10 గంటలకు పెనుగొండలోని రెడ్డి కల్యాణ మండపంలో, మధ్యాహ్నం 3 గంటలకు సిద్ధాంతం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సిద్ధాంతం పరిసర గ్రామాల గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి, మండల సచివాలయ కన్వీనరు సాక సుబ్రహ్మణ్యం తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు హాజరవుతారన్నారు.

నేడు లంకలకోడేరులో..

పాలకొల్లు అర్బన్: లంకలకోడేరు గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన గృహ సారథుల సమావేశం నిర్వహిస్తున్నట్లు వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్ణి జోగయ్య తెలిపారు. తెలిపారు.

క్లుప్తంగా

షర్మిలా రెడ్డికి ఘన సత్కారం



ఆచంటలో రుడా చైర్మన్ షర్మిలా రెడ్డిని సత్కరిస్తున్న ఆచంట వైసీపీ నాయకులు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గ పరిశీలకులు, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి ఆచంట వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. మంగళవారం ఆచంటలో నిర్వహించిన గృహసారథుల సమావేశంలో పార్టీ నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, సర్పంచ్‌లు కోట సరోజని వెంకటేశ్వరరావు, గణేషుల శేషవేణి, ఎంపీటీసీ తొప్పెట్ల విజయకుమారి, కుక్కల కిరణ్, పెచ్చెట్టి సత్యనారాయణ, గురుజుకోట శ్రీనివాస్, షేక్ ఖాసీం పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత డాక్టర్ పూజకు సత్కారం



రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత డాక్టర్ పూజను సత్కరిస్తున్న ఆచంట వేమవరం పీహెచ్‌సీ సిబ్బంది

పెనుగొండ: ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ విభాగంలో రాష్ట్రస్థాయి ప్రతిభ పురస్కారాన్ని కలెక్టరు చేతుల మీదుగా అందుకున్న ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పూజను ఘనంగా సత్కరించారు. మంగళవారం ఆచంట వేమవరం పీహెచ్‌సీలో జరిగిన సత్కారాన్ని అందుకున్న డాక్టర్ పూజ మాట్లాడుతూ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందన్నారు. పీహెచ్‌ఎన్ రత్నకుమారి, ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు ప్రసాద్, హెచ్‌వీఉ, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాతా రమాబాయికి ఘన నివాళి

పాలకొల్లు సెంట్రల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కి అనునిత్యం రమాబాయి సహాయ సహకారాలు అందించి ఆదర్శనీయమైన పాత్ర పోషించారని లవ్ పీపుల్ ఫౌండేషన్ (ఎల్‌పీఎఫ్) వ్యవస్థాపక చైర్మన్ ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మాతా రమాబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ నేటితరం యువతులు, మహిళలు రమాబాయిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లాబత్తుల సూర్యకుమార్, రావి హరీష్‌బాబు, బందెల సాగర్, కారిపల్లి పవన్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలి

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి మురళీకృష్ణ, మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎం జయదుర్గా మాధురి ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీ చేసారు. ఈ తనిఖీల్లో భాగంగా డోర్ నంబర్ ఇన్‌క్లూజన్ లేకుండా ఎరువులు, పురుగు మందుల స్టాక్‌ను నిల్వ ఉంచినట్లు గుర్తించిన దుకాణంలో రూ. 30,200 విలువగల ఎరువులు, రూ. 1,12,000 విలువగల పురుగు మందుల విక్రయాలను నిలుపుదల చేసారు. మామూడూరులో నిబంధనలు పాటించకుండా ఎరువులు విక్రయిస్తున్నారని గుర్తించి, రూ. 2,46,346 విలుగల గల స్టాక్ అమ్మకాలను నిలుపుదల చేసారు.

కుష్టు వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి

పాలకొల్లు అర్బన్: కుష్టు వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే శాశ్వతంగా నివారించవచ్చని లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. ఆశా డే సందర్భంగా మంగళవారం కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. చర్మంపై పాలిపోయిన, లేదా రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకుండా నున్నగా చర్మం మీద వెంట్రుకలు రాలిపోవడం ఈ వ్యాధి లక్షణాలన్నారు. 12 నెలల బహుళ ఔషధ చికిత్స ద్వారా వ్యాధి నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి కె ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్లు వై నారాయణమూర్తి, ఎలిజబెత్, అమరేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

నరసాపురం రూరల్: సేవాకార్యక్రమాలను విస్తృతం చేస్తామని మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీగా విధులు నిర్వహిస్తున్న గుంపుల జనార్దన్ అతని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. జనార్దన్ తండ్రి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గుంపుల రాజారత్నం 10వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నరసాపురం మండలం పసలదీవిలో పేదలు, వితంతువులకు వస్త్ర, అన్నదానం చేశారు. ఎంపీపీ మైలాబత్తుల సోనీ, సర్పంచ్ కొట్టు రామాంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్ మాట్లాడుతూ సెవెన్ ఆలివ్స్ పేరుతో ట్రస్టును ఏర్పాటు చేసి ఏటా తల్లిదండ్రుల స్మృత్యర్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

జగనన్న కాలనీలో మూడు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న ఎలక్ట్రికల్ ఈఈ బళ్ల సురేష్

యలమంచిలి: జగనన్న కాలనీలో ప్రతి ఇంటికి ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఈఈ బళ్ల సురేష్ చెప్పారు. కొంతేరు, అడవిపాలెం, మేడపాడు గ్రామాల సరిహద్దులో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన మూడు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీలో నూతనంగా నిర్మించుకుంటున్న అన్ని ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్, తాగునీరు, రోడ్ల సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు డీఈఈ ఆర్ నాగేశ్వరరావు, యలమంచిలి ఏఈ డి రాజీవ్ విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో మంచి ఉత్తీర్ణతే లక్ష్యం



ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ మధుసూదనరావు

మొగల్తూరు: రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్జేడీ మధుసూదనరావు సూచించారు. మంగళవారం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలను సందర్శించారు. నాడు- నేడులో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఇటీవల 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడంతో వాటి వినియోగించే విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్‌లో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ ప్రకారం ప్రకారం ఆహార పదార్థాలు అందిస్తున్నారా విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో పుష్పరాజ్యం. ప్రధానోపాధ్యాయురాలు బాల నాగమణి, ఉపాధ్యాయులు గోపాల కృష్ణంరాజు, చింతపల్లి కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

చర్చిల అభివృద్ధికి ఆర్థిక సాయం



మొగల్తూరు పంచాయతీ కొండావారిపాలెం చర్చిలో అరుణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘీయులు

మొగల్తూరు: నూతన చర్చిల నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని నందిగామ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం మొగల్తూరులోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను స్థానిక కొండావారిపాలెం, గోడావారిపాలెం సంఘస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తన తల్లి మరియమ్మ జ్ఞాపకార్థ కొండావారిపాలెం, గోడావారిపాలెం చర్చిల శ్లాబ్ నిర్మాణ ఖర్చుంతా తానే భరిస్తానని, అయితే తన తల్లి పేరు చర్చిలో ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో రెవరెండ్ తలారి కొండయ్య మోజేష్ మార్టిన్, బొడ్డుపల్లి సుబ్బారావు, మద్దూరి పెద్దిరాజు, గోడా బాబూరావు, మెడగల్పు రామారావు, వర్ధనపు సుధాకర్, లింగంపల్లి మోహన్ రావు, మెడగల్పు సువర్ణ రాజు, కొయ్యే నాగరాజు, కొల్లాబత్తుల జేమ్స్, విల్టూరి లాజర్, మెడగల్పు రాజశేఖర్, గోడా యోహాన్, కొండా ఆల్బర్ట్ రాజు, జవ్వుదుల ఆనంద్ రావు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నరసాపురం: పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో నాన్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ కాంట్రాక్టర్లకు సూచించారు. 30వ వార్డు స్టేషన్‌పేటలో చేపట్టిన కల్వర్టు పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు సకాలంలో పూర్తిచేయడంతో పాటుగా నాణ్యత విషయంలో రాజీ పడ వద్దని అన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ విషయంలో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. రైల్వేస్టేషన్ పక్క నుంచి బైపాస్ రోడ్డు అందుబాటులోకి వచ్చిన తరువాత ట్రాఫిక్ రద్దీ పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కల్వర్టు పనులు చేపట్టామని చెప్పారు. ఆమె వెంట స్థానిక కౌన్సిలర్ అడిదల శ్యామల, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, అడిదల శరత్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: ఐఐటీ, ఎన్ఐటీ ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జాతీయస్థాయిలో ప్రథమ దశలో నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్షా ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్‌వీ రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో దొంగ రవికృష్ణ 98.6099981, కారుమూరి సుమశ్రీ 98.4837311, కప్పల అభిషేక్ వరమ్ 98.3313868, పెనుగొండ సుధీష్ణ 98.1796947, కడలి లక్ష్మీదుర్గ 97.3760053, ములుగుర్తి పావని 97.1139935 పర్సంటైల్ సాధించారన్నారు. ఇంకా 95 పర్సంటైల్ పైన సాధించిన విద్యార్థులు 18 మంది ఉన్నారన్నారు. కేవలం డే స్కాలర్ విద్యావిధానం ద్వారా జాతీయస్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించేందుకు విద్యార్థులను శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందాన్ని సంస్థ చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, రాఘవరెడ్డి, ఏవోజీ వాసుబాబు అభినందించారు.

భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీ వాహనాల హవా



జ్యోతి ప్రజ్వలన చేసి విద్యుత్ 2కే 23 ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ తదితరులు

నరసాపురం రూరల్: భవిష్యత్‌లో గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ వాహనాల హవా కొనసాగుతుందని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కేవీ సత్యనారాయణ పేర్కొన్నారు. నరసాపురం మంగళవారం మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ 2కే 23 ఫెస్ట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. కళాశాల కోశాధికారి కొండవీటి త్రినాద్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఉపయోగపడే పరిశోధనలు చేయాల్సి అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పులపర్తి వెంకటేశ్వరరావు, అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ సురేష్‌కుమార్, పండరీనాథ్, విభాగాధిపతులు సత్యనారాయణ, ఫెస్ట్ కన్వీనర్ వలవల మధు, డాక్టర్ వై వెంకటేష్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వరుడి సోదరుడు మృతి

పెనుగొండ: సోదరుడి వివాహం ఘనంగా నిర్వహించాలన్న ఉద్దేశ్యంతో బంధువులకు పెళ్లి శుభలేఖలు పంచేందుకు వెళుతున్న ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తిని మృత్యువు కబళించింది. వివరాల్లోకి వెళితే..సిద్ధాంతం గ్రామం పెదపేటకు చెందిన బత్తుల సునీల్ కుమార్ వివాహం ఈ నెల 16న జరగనుంది. దీంతో సోదరుడు రత్నశేఖర్ (36)తో కలిసి బంధువులకు పెళ్లి శుభలేఖలు పంచుతున్నారు. యథావిధిగా సోమవారం ఉదయం నుంచి అన్నదమ్ములు ఇరువురూ కలిసి కార్డులు పంచుతూ, రాత్రి ఆచంట మండలం కోడేరులోని వారి మావయ్య ఇంటికి వెళ్లి శుభలేఖ అందించి తిరిగి వెళుతుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో రత్నశేఖర్ ఘటనాస్థలంలోనే ప్రాణాలు విడిచాడు. ఈ ప్రమాదంలో వరుడు సునీల్‌కుమార్‌కు తీవ్ర గాయాలవ్వడంతో 108లో తణుకు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దీంతో పెళ్లింట విషాదం నెలకొంది. మృతుడు రత్నశేఖర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె సంతానం. ఈ ప్రమాదంపై ఆచంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతి దేవస్థానం ట్రస్టు బోర్డులో తప్పని సరిగా నాయీ బ్రాహ్మణులను ట్రస్టీగా స్థానం కేటాయించాలని సీఎం జగన్ ఆర్డినెన్స్ తీసుకురావడం అభినందనీయమని నాయీ బ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు కట్టుంగ శ్రీమన్నారాయణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వల్లూరులో మాట్లాడుతూ చరిత్రలోనే తొలిసారిగా గవర్నరు ద్వారా ఆర్డినెన్స్ తీసుకురావడంతో సంఘం తరఫున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

రీ సర్వేతో మేలు

తాడేపల్లిగూడెం రూరల్: భూసమస్యల పరిష్కారానికి రీ సర్వే కార్యక్రమం ఉపకరిస్తుందని ల్యాండ్ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.అన్నపూర్ణ తెలిపారు. జగనన్న భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని జగన్నాథపురంలో రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ అన్నపూర్ణ మాట్లాడుతూ భూమి రీ-సర్వే ద్వారా కచ్చితమైన హద్దులు వస్తాయన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ఎటువంటి సరిహద్దు తగాదాలు ఉండవన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ పానుకుమాటి గౌరి, ఉప సర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్, మండల సర్వేయర్ ఎస్.చక్రవర్తి, సచివాలయ కార్యదర్శి జడ్డు ఫణీంద్రకుమార్, వీఆర్వో ఎస్.నాగరాజు, దుర్గాప్రసాద్, టెక్నికల్ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: కోర్టుల చుట్టూ ప్రజలు తిరుగుతూ సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోవద్దని, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ద్వారా ఏర్పాటైన లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ ఉషా లక్ష్మీకుమారి తెలిపారు. మంగళవారం కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషా లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఫిబ్రవరి 11న పట్టణ కోర్టు ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న తగాదాలను కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవచ్చన్నారు. రాజీ చేసుకునే కక్షిదారులు కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించాలన్నారు.

రాజీ ద్వారా ఇద్దరూ గెలిచినట్టే

నరసాపురం: రాజీ చేసుకోవడం ద్వారా ఇరు వర్గాలు గెలచినట్టవుతుందని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ సూచించారు. ఈనెల 11న నరసాపురం కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా డబ్బు, సమయం రెండూ ఆదా చేసుకోవచ్చని సూచించారు. కేసులు రాజీ అయ్యే దిశగా పోలీసులు, న్యాయవాదులు సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని చెప్పారు.

నేడు డప్పు కళాకారుల సమావేశం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లి అంబేడ్కర్ భవనంలో బుధవారం ఉదయం 10గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత డప్పు కళాకారుల జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ముఖ్య కళాకారులను ఆహ్వానించినట్లు, జెడ్పీచైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజక వర్గంలోని డప్పు కళాకారులంతా సదస్సుకి హాజరుకావాలని ఆయన కోరారు.

డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడిక

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో ఆంధ్రా బ్యాంక్ రోడ్డులోని డ్రెయిన్ పూడుకుపోవడంతో మురుగు నీరు పారడంలేదని దీంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు అన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. అయితే ఈ పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. ఆంధ్రాబ్యాంక్ రోడ్డులో పలు విద్యా సంస్థలు ఉన్నాయి. ఇటుగా వెళ్లేవారు ముక్కుమూసుకుని రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొంది. డ్రెయిన్‌ను శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తికి ఏడాది జైలు

పాలకొల్లు అర్బన్: మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన నేరం రుజువు కావడంతో గరికి సుబ్బరాజుకి ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ మంగళవారం పాలకొల్లు కోర్టు మేజిస్ట్రేట్ భానుసాయి తీర్పు చెప్పారు. పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గతేడాది ఏప్రిల్‌లో జరిగిన నేరంపై రూరల్ ఎస్సై కె శ్రీనివాస్ కేసు నమోదు చేసి చార్జిషీట్ కోర్టుకి సమర్పించారు. ఏపీపీ మాదాసు జయసింధు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. సీఐ కొండవీటి శ్రీనివాస్ కుమార్ ప్రాసిక్యూషన్‌కి సహకరించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

సిద్ధాంతం శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు

పెనుగొండ: సిద్ధాంతం కేదారీ ఘాట్‌లోని శ్మశాన వాటిక అభివృద్ధికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు నిధులు మంజూరు చేసారని సిద్ధాంతం ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రణాళిక ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించామన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా సీపీఎం నాయకులు మాట్లాడుతున్నారన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. దుష్ప్రచారం తగదని హితవు పలికారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

పాలకొల్లు అర్బన్: శివదేవుని చిక్కాలకు చెందిన సంది రమేష్ (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు రూరల్ ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మృతుడు రమేష్ నోటి నుంచి నురగ, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావం కనిపించడంతో స్థానికులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధా రించారు. మృతునికి 11 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇరువురు సంతానం ఉన్నారు. మూడేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసు కుని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. మృతుడి తండ్రి సంది ఇస్సాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతి

మొగల్తూరు: రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఉంగరాల శ్రీనివాస్ (46) మంగళవారం మృతి చెందారు. ఎస్సై ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం ఏడు నెలల క్రితం ఎస్పీ కార్యాలయం నుంచి మొగల్తూరు స్టేషన్‌కు బదిలీపై శ్రీనివాస్ వచ్చారు. ఆయనకు భార్య, కుమార్తె కలరు. హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల ఎస్పీ రవి ప్రకాష్, డీఎస్పీ మనోహరాచారి, సీఐ సురేష్ బాబు, ఎస్సై వీరబాబు, స్టేషన్ సిబ్బంది తమ ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

పాలకొల్లు అర్బన్: క్రైస్తవులపై దాడులు చేస్తున్న మతోన్మాదులపై ప్రభుత్వాలు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. పాలకొల్లు మండలం పూలపల్లి అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ దేవిడ్‌కి వినతిపత్రం అందజేశారు. తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్, యంగ్ పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లు, పోడూరు, ఆచంట, నరసాపురం, మొగల్తూరు, వీరవాసరం, యలమంచిలి, పెనుమంట్ర, పెనుగొండ, భీమవరం మండలాలకు చెందిన పాస్టర్లు, విశ్వాసులు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి క్రైస్తవుల సమస్యలు

క్రైస్తవుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మేడిది జాన్సన్ హామీ ఇచ్చారు. ర్యాలీలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు జాన్సన్‌కి కూడా వినతిపత్రం అందజేశారు. ర్యాలీలో సంస్థ ప్రతినిధులు డా.ననమండ ఎబినేజర్, పాస్టర్ పాలుమూరి సామ్యూల్, బ్రదర్ రాపాక రత్నంరాజు, పాస్టర్ ఐ సెయింట్ పాల్, పాస్టర్ పి యేసుదాసు, పాస్టర్ వై రూబేన్, సీహెచ్ సురేష్, బి విలియం సండర్స్, జి రాజేష్, జీఎస్ కుమార్, వి విజయరత్నం పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

పోడూరు: జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పెనుమదంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వెటర్నరీ సిబ్బంది పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ పక్షోత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు మండల వ్యాప్తంగా అన్ని పశు వైద్యశాలల్లోనూ పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నామని చెప్పారు. పెంపుడు జంతువుల ఆరోగ్యం పట్ల యజమానులు తగిన శ్రద్ధ తీసుకోవాలని, అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు పశు వైద్యులకు చూపించి తగిన చికిత్స చేయించాలని చెప్పారు. వెటర్నరీ ఏడీ డాక్టర్ జయకర్ జాన్సన్, పెనుమదం వీఎల్‌ఓ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.